# గలతీయులకు వ్రాసిన పత్రిక

1 పౌలు అనే నేను మనుష్యుల ద్వారా గాని ఒక వ్యక్తి వలన గాని
పంపబడలేదు, కాని యేసు క్రీస్తు, ఆయనను మరణం నుండి తిరిగి
లేపిన తండ్రియైన దేవుని వలన అపొస్తలునిగా పంపబడ్డాను.
2 నేనూ, నాతో ఉన్న సహోదరీ సహోదరులందరం కలిసి,
గలతీ ప్రాంతంలోని సంఘాలకు వ్రాయునది:
3 మన తండ్రియైన దేవుని నుండి, ప్రభువైన యేసు క్రీస్తు నుండి
మీకు కృపా సమాధానాలు కలుగును గాక.
4 క్రీస్తు మన తండ్రియైన దేవుని చిత్తానికి లోబడి, దుష్టత్వం
ఏలుబడి చేసే ప్రస్తుత యుగం నుండి మనల్ని విడిపించడానికి మన
పాపాల కోసం ప్రాయశ్చిత్తంగా తనను తాను అర్పించుకున్నారు.
5 ఆయనకే నిరంతరం మహిమ కలుగును గాక ఆమేన్.

### వేరొక సువార్త లేదు

6 మీ గురించి నేను ఆశ్చర్యపడుతున్నాను ఎందుకంటే, క్రీస్తు
కృపలో బ్రతకడానికి మిమ్మల్ని పిలిచిన వానిని మీరు ఇంత త్వరగా
వదిలేసి, వేరొక సువార్త వైపుకు తిరుగుతున్నారు.
7 నిజానికి అది సువార్త కానే కాదు. అయితే కొందరు సువార్తను
తారుమారు చేయాలని ప్రయత్నిస్తూ మిమ్మల్ని గందరగోళంలోనికి
నెడుతున్నారు.
8 అయితే మేమే గాని పరలోకం నుండి వచ్చిన దేవదూతే గాని,
మేము మీకు ప్రకటించిన సువార్త కాక వేరొక సువార్త ప్రకటిస్తే, వారి
మీదికి దేవుని శాపం వచ్చును గాక!

9 మేము ఇప్పటికే చెప్పినట్లుగా, ఇప్పుడు నేను మళ్ళీ చెప్తున్నాను:
మీరు అంగీకరించిన సువార్త కాక ఎవరైనా వేరే సువార్త ప్రకటిస్తే వారి
మీదికి దేవుని శాపం వచ్చును గాక!
10 నేను ఇప్పుడు మనుష్యుల ఆమోదం పొందటానికి
ప్రయత్నిస్తున్నానా, లేక దేవుని ఆమోదమా? నేను ప్రజలను
సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తున్నానా? ఒకవేళ నేను ప్రజలను
సంతోషపెట్టేవాడనైతే నేను క్రీస్తుకు సేవకునిగా ఉండలేను.

## దేవునిచేత పిలువబడిన పౌలు

11 సహోదరీ సహోదరులారా నేను ప్రకటించిన సువార్త మానవుని
నుండి వచ్చింది కాదని మీరు తెలుసుకోవాలి.
12 నేను ఏ మానవుని నుండి దాన్ని పొందలేదు, నాకెవరూ
బోధించలేదు; యేసు క్రీస్తు నాకు ఇచ్చిన ప్రత్యక్షత ద్వారానే నేను
పొందాను.
13 నేను యూదా మతంలో జీవించిన నా గత జీవిత విధానాన్ని
గురించి, అలాగే దేవుని సంఘాన్ని నాశనం చేయడానికి దాన్ని ఎంత
క్రూరంగా నేను హింసించానో మీరు విన్నారు.
14 నా స్వజనులలో నా వయస్సుగల అనేకుల కంటే యూదా
మతవిషయంలో నేను ఎంతో ముందున్నాను, నా పూర్వికుల
ఆచారాలను పాటించడంలో నాకు అత్యాసక్తి ఉండేది.
15 కాని తన కృప ద్వారా నన్ను నా తల్లి గర్భం నుండే
ప్రత్యేకపరచుకొని నన్ను పిలిచిన దేవుడు,
16 తన కుమారుని గురించి యూదేతరుల మధ్య నేను సువార్తను
ప్రకటించేలా ఆయన తన కుమారున్ని నాలో బయలుపరచడానికి
ఇష్టపడ్డారు. దానికి నేను వెంటనే మనుష్యులను సంప్రదించలేదు.
17 అలాగే నా కంటే ముందు నుండి అపొస్తలులుగా ఉన్నవారిని
సంప్రదించడానికి నేను యెరూషలేము వెళ్లలేదు, కాని నేను
అరేబియాకు వెళ్లాను. తర్వాత దమస్కుకు తిరిగి వచ్చాను.

18 మూడు సంవత్సరాల తర్వాత, కేఫాను* పరిచయం
చేసుకోవడానికి యెరూషలేముకు వెళ్లి అక్కడ పదిహేను రోజులు
అతనితో ఉన్నాను.
19 ప్రభువు సోదరుడైన యాకోబును తప్ప ఇతర అపొస్తలుల్లో
ఎవరిని నేను చూడలేదు.
20 నేను మీకు వ్రాసేది అబద్ధం కాదని దేవుని ముందు రూఢిగా
చెప్తున్నాను.
21 ఆ తర్వాత నేను సిరియాకు, కిలికియకు వెళ్లాను.
22 యూదయలోని క్రీస్తులో ఉన్న సంఘాలకు వ్యక్తిగతంగా నేను
తెలియదు.
23 వారు, "ఇంతకుముందు మనల్ని హింసించినవాడు, ఏ
విశ్వాసాన్నైతే నాశనం చేయాలని ప్రయత్నించాడో దానినే ఇప్పుడు
ప్రకటిస్తున్నాడు" అని మాత్రమే విన్నారు.
24 కాబట్టి వారు నన్ను బట్టి దేవుని స్తుతించారు.

# 2

## అపొస్తలులు పౌలును అంగీకరించుట

1 పద్నాలుగు సంవత్సరాల తర్వాత తీతును వెంటబెట్టుకొని
బర్నబాతో కలిసి మళ్ళీ యెరూషలేముకు వెళ్లాను.
2 దేవుడు నాకు ఇచ్చిన ప్రత్యక్షతను బట్టి నేను అక్కడ
నాయకులుగా పేరొందిన వారితో ఏకాంతంగా సమావేశమై,
నేను యూదేతరుల మధ్య ప్రకటిస్తున్న సువార్త గురించి వారికి
తెలియజేశాను. నా పందెంలో నేను వ్యర్థంగా పరుగెత్తలేదని
పరుగెత్తకూడదని ఖచ్చితంగా కోరుతున్నాను.
3 నాతో యెరూషలేముకు వచ్చిన తీతు గ్రీసు దేశస్థుడైనప్పటికి
సున్నతి పొందాలని అతన్ని బలవంత పెట్టలేదు.

* **1:18** అంటే, పేతురు

4 క్రీస్తు యేసులో మనకున్న స్వేచ్ఛపై నిఘా పెట్టడానికి మమ్మల్ని
బానిసలుగా చేయడానికి మన మధ్యలోనికి చొరబడిన కొంతమంది
అబద్ధపు విశ్వాసుల వలన ఈ విషయం తలెత్తింది.
5 అయితే ఈ సువార్త సత్యం మీలో నిలిచి ఉండేలా ఒక్క క్షణం
కూడా మేము వారితో ఏకీభవించలేదు.
6 కొంతమంది గొప్ప పేరుగాంచిన వారు ఉన్నప్పటికీ, వారెవరైనా సరే
నేను లెక్కచేయను, ఎందుకంటే దేవుడు పక్షపాతం చూపేవాడు కాదు,
అయినా వారు నా సందేశానికి ఏమి చేర్చలేదు.
7 సున్నతి పొందిన వారి కోసం పేతురు నియమింపబడినట్లే,
సున్నతి లేనివారికి సువార్త ప్రకటించే బాధ్యత నాకు
అప్పగించబడిందని వారు గుర్తించారు.
8 ఎందుకంటే, సున్నతి పొందే యూదుల కోసం అపొస్తలునిగా
ఉండడానికి పేతురుకు సామర్థ్యం ఇచ్చిన దేవుడే సున్నతిలేని
యూదేతరుల కోసం అపొస్తలునిగా ఉండడానికి నాకు కూడా
సామర్థ్యం ఇచ్చారు.
9 సంఘానికి మూలస్తంభాలుగా పేరు పొందిన యాకోబు, కేఫా,
యోహాను అనేవారు దేవుడు నాకిచ్చిన కృపను గుర్తించినపుడు
మమ్మల్ని స్వీకరించి మాతో సహవాస సూచనగా నాకు బర్నబాకు
తమ కుడిచేతిని అందించారు. మేము యూదేతరుల దగ్గరకు, వారు
యూదుల దగ్గరకు వెళ్లాలని అంగీకరించారు.
10 అయితే వారు అడిగింది ఏంటంటే, మేము పేదవారిని ఎప్పుడు
జ్ఞాపకం చేసుకోవాలని వారు కోరారు; ఎప్పుడు నేను చేయాలని
కోరుకునేది కూడా అదే.

## కేఫాను వ్యతిరేకించిన పౌలు

11 కేఫా అనే పేతురు అంతియొకయకు వచ్చినపుడు, అతడు
తప్పు చేశాడు కాబట్టి నేను అతన్ని ముఖాముఖిగా నిలదీశాను.
12 ఎందుకంటే, యాకోబు దగ్గరి నుండి కొందరు మనుష్యులు
రాకముందు అతడు యూదేతరులతో కలిసి భోజనం చేస్తున్నాడు.

కాని వారు వచ్చినప్పుడు, అతడు సున్నతి చేయబడిన వారికి
భయపడి వెనుకకు తగ్గి యూదేతరుల నుండి ప్రక్కకు వెళ్ళిపోయాడు.
13 ఇతర యూదులు కూడా అతని వేషధారణలో జత కలిశారు,
దాని ఫలితంగా బర్నబా కూడా వారి వేషధారణను బట్టి దారితప్పాడు.

14 వారు సువార్త సత్యం ప్రకారం ప్రవర్తించడం లేదని నేను
చూసినప్పుడు, వారందరి ముందు కేఫా అనే పేతురుతో, “నీవు
యూదుడవు, అయినా నీవు యూదుల్లా కాక యూదేతరుల్లా
జీవిస్తున్నావు. అలాంటప్పుడు యూదుల ఆచారాలను
అనుసరించమని యూదేతరులను ఎందుకు బలవంతం చేస్తున్నావు?

15 “మనం పుట్టుకతోనే యూదులం, యూదేతరుల్లా పాపులం
కాము.
16 ఒక వ్యక్తి ధర్మశాస్త్రాన్ని ఆచరించడం వల్ల నీతిమంతునిగా
తీర్చబడడు, కాని యేసు క్రీస్తులో విశ్వాసముంచడం వల్లనే అని
మనకు తెలుసు. అందుకే, మేము కూడా ధర్మశాస్త్ర క్రియలనుబట్టి
కాక, క్రీస్తులో విశ్వాసముంచడం ద్వారా నీతిమంతులంగా తీర్చబడ్డాం,
ఎందుకంటే ధర్మశాస్త్ర క్రియలనుబట్టి ఎవ్వరూ నీతిమంతులుగా
తీర్చబడలేరు.

17 “కాని ఒకవేళ, క్రీస్తులో నీతిమంతులు కావాలని కోరుకుంటూ,
యూదులమైన మనం కూడా పాపులమని తీర్చబడితే, క్రీస్తు పాపాన్ని
ప్రోత్సహిస్తున్నారని అర్థం కాదా? కానే కాదు!
18 ఒకవేళ నేను కూల్చివేసిన దానిని మరల కడితే, అప్పుడు నేను
నిజంగానే అపరాధిని అవుతాను.

19 “నేను దేవుని కోసం జీవించటానికి ధర్మశాస్త్ర విషయంలో
ధర్మశాస్త్రం ద్వారా చనిపోయాను.
20 నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడ్డాను, ఇప్పుడు జీవిస్తుంది
నేను కాదు, క్రీస్తే నాలో జీవిస్తున్నారు. ఇప్పుడు నేను శరీరంలో
జీవిస్తున్న జీవితం, నన్ను ప్రేమించి నా కోసం తనను తాను

అర్పించుకొన్న దేవుని కుమారునియందు విశ్వాసముంచడం వల్ల
జీవిస్తున్నాను.
21 దేవుని కృపను నేను తిరస్కరించను, ఒకవేళ, ధర్మశాస్త్రం ద్వారా
నీతి పొందుకోగలిగితే, క్రీస్తు కారణం లేకుండా చనిపోయినట్లే!"

# 3

## విశ్వాసమా ధర్మశాస్త్ర క్రియలా

1 అవివేకులైన గలతీయులారా! మిమ్మల్ని ఎవరు భ్రమపెట్టారు?
యేసు క్రీస్తు మీ కళ్లముందే సిలువ వేయబడినంత స్పష్టంగా
వివరించాము.
2 ఒక్క విషయాన్ని నేను మీ నుండి
తెలుసుకోవాలనుకుంటున్నాను: మీరు ధర్మశాస్త్ర క్రియల వల్ల ఆత్మను
పొందారా, లేక మీరు విన్న దాన్ని విశ్వసించడం వల్లనా?
3 మీరు ఇంత అవివేకులా? ఆత్మతో ప్రారంభించి, ఇప్పుడు
శరీరంతో పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారా?
4 మీరు పొందిన శ్రమ వ్యర్థమేనా? అదంతా నిజంగా వ్యర్థమేనా?
5 నేను మళ్ళీ అడుగుతున్నాను, దేవుడు మీకు తన ఆత్మను ఇచ్చి,
మీ మధ్య అద్భుతాలు జరిగిస్తూ ఉన్నది ధర్మశాస్త్ర క్రియల వల్లనా, లేక
మీరు విన్న దాన్ని విశ్వసించడం వల్లనా?
6 అలాగే మన పూర్వీకుడైన అబ్రాహాము కూడా, "దేవుని నమ్మాడు,
అది అతనికి నీతిగా ఎంచబడింది."*
7 కాబట్టి మీరు అర్థం చేసుకోవలసింది ఏంటంటే విశ్వాసం
కలిగినవారే అబ్రాహాముకు పిల్లలవుతారు.
8 దేవుడు యూదేతరులను వారి విశ్వాసం వల్ల నీతిమంతులుగా
తీరుస్తారని లేఖనంలో ముందుగానే చెప్పబడింది. "నిన్ను బట్టి
సర్వ జనులు దీవించబడతారు"† అని చెప్పడం ద్వారా అబ్రాహాముకు
ముందుగానే సువార్త ప్రకటించబడింది.

---

* **3:6** ఆది 15:6 † **3:8** ఆది 12:3; 18:18; 22:18

9 అందువల్ల విశ్వాసంపై ఆధారపడే ప్రతి ఒక్కరూ విశ్వాస పురుషుడైన అబ్రాహాముతో పాటు ధన్యులవుతారు.

10 ధర్మశాస్త్ర క్రియలపై ఆధారపడే వారందరూ శాపగ్రస్తులు, ఎలాగంటే లేఖనాల్లో వ్రాయబడిన ప్రకారం: "ధర్మశాస్త్రంలో వ్రాయబడిన వాటన్నిటిని పాటించనివారు శాపగ్రస్తులు."‡
11 ధర్మశాస్త్రం మీద ఆధారపడే ఏ ఒక్కడూ దేవుని ముందు నీతిమంతునిగా తీర్చబడడు, ఎందుకంటే "నీతిమంతుడు విశ్వాసమూలంగా జీవిస్తాడు."§
12 ధర్మశాస్త్రం విశ్వాసానికి సంబంధించింది కాదు పైగా "వీటిని చేసేవారు వాటి వల్లనే జీవిస్తారు"* అని అది చెప్తుంది.
13 ధర్మశాస్త్రం వల్ల వచ్చే శాపం నుండి మనల్ని విమోచించడానికి క్రీస్తు మన కోసం శాపగ్రస్తుడయ్యారు. ఎలాగంటే, లేఖనాల్లో, "మ్రానుపై వ్రేలాడదీయబడిన ప్రతి ఒక్కరూ శాపగ్రస్తులే"† అని వ్రాయబడిన దాని ప్రకారం.
14 విశ్వాసం ద్వారా దేవుని ఆత్మను గురించిన వాగ్దానాన్ని మనం పొందుకునేలా అబ్రాహాముకు ఇవ్వబడిన దీవెన క్రీస్తు యేసు ద్వారా యూదేతరులకు కూడా వర్తించాలని ఆయన మనల్ని విమోచించారు.

## ధర్మశాస్త్రం, వాగ్దానం

15 సహోదరీ సహోదరులారా, అనుదిన జీవితం నుండి ఒక ఉదాహరణ మీకు చెప్తాను. మనుష్యులు చేసిన ఒడంబడికే అయినా దాన్ని స్థిరపరచిన తర్వాత దాన్ని ఎవరూ కొట్టివేయలేరు దానికి ఏమి కలపలేరు. ఇది కూడా అంతే.
16 అబ్రాహాముకు అతని సంతానానికి వాగ్దానాలు ఇవ్వబడ్డాయి. లేఖనంలో అనేకులను ఉద్దేశించి "సంతానాలకు" అని చెప్పడం లేదు,

---

‡ **3:10** ద్వితీ 27:26 § **3:11** హబ 2:4 * **3:12** లేవీ 18:5 † **3:13** ద్వితీ 21:23

గాని ఒక్క వ్యక్తిని ఉద్దేశించి, "నీ సంతానానికి"‡ అని చెప్పారు, ఆ
సంతానం క్రీస్తు.
17 నేను చెప్పేదేంటంటే, 430 సంవత్సరాల తర్వాత ఇవ్వబడిన
ధర్మశాస్త్రం దేవునిచే ముందుగానే స్థిరపరచబడిన ఒడంబడికను
ప్రక్కన పెట్టదు అలాగే దేవుని వాగ్దానాన్ని నిరర్థకం చేయదు.
18 ఎందుకంటే ఒకవేళ ఆ వారసత్వం ధర్మశాస్త్రం మీద ఆధారపడి
ఉంటే, ఇక వాగ్దానం మీద ఆధారపడదు, అయితే దేవుడు
అబ్రాహాముకు ఆ వారసత్వాన్ని తన కృపలో వాగ్దానం ద్వారా ఇచ్చారు.
19 అలాంటప్పుడు, ధర్మశాస్త్రం ఎందుకు ఇవ్వబడింది? వాగ్దానం
ఎవరికి వర్తిస్తుందో ఆ సంతానం వచ్చేవరకు అతిక్రమాలను
చూపడానికి ధర్మశాస్త్రం ఇవ్వబడింది. ఆ ధర్మశాస్త్రం దూతల ద్వారా
ఇవ్వబడి మధ్యవర్తికి అప్పగించబడింది.
20 అయినప్పటికీ మధ్యవర్తి ఒక్కరికే కాదు, కానీ దేవుడు ఒక్కడే.
21 అలాగైతే ధర్మశాస్త్రం దేవుని వాగ్దానాలకు వ్యతిరేకమా? ఎన్నటికి
కాదు! ఇవ్వబడిన ధర్మశాస్త్రం మనకు జీవాన్ని ఇచ్చి ఉంటే,
తప్పకుండా ధర్మశాస్త్రం వల్లనే నీతి కలిగి ఉండేది.
22 అయితే యేసు క్రీస్తులో విశ్వాసముంచడం ద్వారా కలిగిన
వాగ్దానం ఆయనను నమ్మేవారికి ఇవ్వబడాలని, లేఖనం సమస్తాన్ని
అందరిని పాపంలో బంధించింది.

### దేవుని పిల్లలు

23 ఈ విశ్వాసం గురించి తెలియక ముందు, విశ్వాసం
బయలుపరచబడే వరకు మనం బంధింపబడి ధర్మశాస్త్రం అదుపులో
ఉంచబడ్డాము.
24 అందువల్ల మనం విశ్వాసం వల్ల నీతిమంతులుగా తీర్చబడేలా
క్రీస్తు వచ్చేవరకు ధర్మశాస్త్రం మనకు ఒక సంరక్షకునిగా ఉండింది.

‡ **3:16** ఆది 12:7; 13:15; 24:7

25 అయితే ఇప్పుడు ఈ విశ్వాసం మనకు బయలుపరచబడింది
కాబట్టి మనం సంరక్షకుని ఆధీనంలో ఉండే అవసరం లేదు.
26 కాబట్టి మీరందరు యేసు క్రీస్తులో విశ్వాసముంచడం ద్వారా
దేవుని కుమారులై ఉన్నారు.
27 క్రీస్తులో బాప్తిస్మం పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని
ఉన్నారు.
28 ఇందులో యూదులని గ్రీసు దేశస్థులని, దాసులని
స్వతంత్రులని, పురుషుడని స్త్రీ అని ఏ భేదం లేదు, క్రీస్తు యేసులో
అందరు ఒక్కటే.
29 మీరు క్రీస్తుకు చెందినవారైతే, మీరు అబ్రాహాము సంతానంగా
ఉండి వాగ్దాన ప్రకారం వారసులు.

# 4

1 అయితే ఇప్పుడు నేను చెప్పేది ఏంటంటే, వారసుడు బాలునిగా
ఉన్నంత వరకు అతడు ఆస్తి అంతటికి యజమాని అయినప్పటికీ
అతడు దాసుని కన్నా గొప్పవాడు కాడు.
2 తన తండ్రి నిర్ణయించిన సమయం వచ్చేవరకు వారసుడు
సంరక్షకులు నిర్వాహకుల ఆధీనంలో ఉంటాడు.
3 అలాగే మనం తగిన వయస్సు వచ్చేవరకు ఈ లోకానికి
సంబంధించిన మూల నియమాల క్రింద బానిసలుగా ఉన్నాము.
4-5 అయితే కాలం సంపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారున్ని
పంపారు; ఆయన ఒక స్త్రీకి జన్మించి, మనం దత్తపుత్రులం కావాలని
ధర్మశాస్త్ర ఆధీనంలో ఉన్నవారిని విడిపించాలని ఆయన ధర్మశాస్త్రానికి
లోబడినవాడయ్యారు.
6 మీరు ఆయన కుమారులు కాబట్టి, "అబ్బా, తండ్రీ" అని
మొరపెట్టే తన కుమారుని ఆత్మను దేవుడు మన హృదయాల్లోకి
పంపారు.
7 కాబట్టి ఇకపై మీరు దాసులు కారు, కానీ దేవుని పిల్లలు; మీరు
ఆయన పిల్లలు కాబట్టి దేవుడు మిమ్మల్ని వారసులుగా చేశారు.

## పౌలుకు గలతీయుల గురించిన చింత

8 గతంలో, మీరు దేవుని ఎరుగక ముందు, మీరు స్వాభావికంగా
దేవుళ్ళు కాని వారికి బానిసలై ఉన్నారు.
9 కాని ఇప్పుడు మీరు దేవుణ్ని తెలుసుకున్నారు, దేవుడు
మిమ్మల్ని ఎరిగి ఉన్నారు. అలాంటప్పుడు మీరు మళ్ళీ
వెనుకకు ఆ బలహీనమైన దిక్కుమాలిన సిద్ధాంతాల వైపు
ఎందుకు తిరుగుతున్నారు? మీరు మళ్ళీ వాటికి బానిసలవ్వాలని
కోరుకుంటున్నారా?
10 మీరు ప్రత్యేకమైన రోజులను, నెలలను, పండుగలను,
సంవత్సరాలను ఆచరిస్తున్నారు గదా!
11 నేను మీ కోసం పడిన కష్టమంతా వృథా అవుతుందేమో అని
భయపడుతున్నాను.
12 సహోదరీ సహోదరులారా, నేను మీలా మారినట్లే మీరూ నాలా
మారాలని మిమ్మల్ని వేడుకొంటున్నాను. మీరు నా పట్ల ఏ తప్పు
చేయలేదు.
13 నాకు అనారోగ్యంగా ఉన్నా నేను మొదటిగా మీకు సువార్త
ప్రకటించానని మీకు తెలుసు.
14 నా అనారోగ్యం మీకు ఇబ్బందిని కలిగించినప్పటికీ, మీరు నన్ను
తిరస్కరించలేదు అలక్ష్యం చేయలేదు. నిజానికి, మీరు నన్ను దేవుని
దూతలా, నేనే యేసు క్రీస్తును అయినట్టు చేర్చుకున్నారు.
15 అయితే నా వలన మీరు పొందిన దీవెన ఇప్పుడేమైపోయింది?
మీరు మీ కళ్లను కూడా పెరికివేసి నాకు ఇచ్చేవారని, నేను మీ గురించి
సాక్ష్యమివ్వగలను.
16 అయితే ఇప్పుడు మీకు సత్యాన్ని చెప్పి నేను మీకు
శత్రువునయ్యానా?
17 ఆ ప్రజలు మిమ్మల్ని గెలవాలని ఆసక్తి కలిగి ఉన్నారు, కాని అది
మీ మేలుకోసం కాదు. మీరు వారి పట్ల ఆసక్తిని చూపించాలని, వారు
మా నుండి మిమ్మల్ని వేరు చేయాలనుకుంటున్నారు.

18 నేను మీతో ఉన్నప్పుడే కాకుండా ఎప్పుడూ మంచి ఉద్దేశాలలో
ఆసక్తి కలిగి ఉండడం మంచిదే.
19 నా ప్రియ పిల్లలారా, మీలో క్రీస్తు స్వరూపం ఏర్పడే వరకు నేను
మరలా ప్రసవ వేదన పడుతున్నాను.
20 నేను మీ గురించి కలవరపడుతున్నాను. ఇప్పుడు నేను మీతో
ఉండి మరో విధంగా మాట్లాడగలిగితే ఎంత బాగుండేది!

### హాగరు, శారా

21 ఒక్క మాట చెప్పండి, ధర్మశాస్త్రానికే లోబడి ఉండాలనుకునే
మీకు ధర్మశాస్త్రం ఏమి చెప్తుందో తెలియదా?
22 వ్రాయబడి ఉన్న ప్రకారం, అబ్రాహాముకు ఇద్దరు కుమారులు,
ఒకడు దాసియైన స్త్రీ వలన, మరొకడు స్వతంత్రురాలైన స్త్రీ వలన
పుట్టారు.
23 దాసియైన స్త్రీ వలన పుట్టిన కుమారుడు శరీరానుసారంగా
పుట్టాడు, స్వతంత్రురాలైన స్త్రీ వలన పుట్టిన కుమారుడు దైవిక వాగ్దాన
ఫలితంగా పుట్టాడు.
24 ఈ విషయాలను ఉపమానరీతిగా చెప్పవచ్చు. ఈ స్త్రీలు రెండు
నిబంధనలను సూచిస్తున్నారు. ఒక నిబంధన సీనాయి పర్వతం
దగ్గరిది, ఇది హాగరు: బానిసలుగా ఉండడానికి పిల్లలను కంటుంది.
25 హాగరు అరేబియాలో ఉన్న సీనాయి పర్వతాన్ని సూచిస్తుంది.
ప్రస్తుతం ఉన్న యెరూషలేము పట్టణంలా ఆమె తన పిల్లలతో సహా
బానిసత్వంలో ఉంది.
26 కాని పైనుండి వచ్చే యెరూషలేము స్వతంత్రమైనది, ఆమె
మనకు తల్లి.
27 అయితే వ్రాయబడిన ప్రకారం,
"గొడ్రాలా, పిల్లలు కననిదానా, ఆనందించు;
ప్రసవవేదన పడనిదానా,
ఆనందంతో కేకలు వేయి;
ఎందుకంటే, భర్త ఉన్నదాని పిల్లలకంటే

విడిచిపెట్టబడిన స్త్రీ పిల్లలు ఎక్కువమంది ఉన్నారు."*
28 అయితే సహోదరీ సహోదరులారా, మీరు ఇస్సాకులా వాగ్దానం
ద్వారా పుట్టిన పిల్లలు.
29 ఆ సమయంలో శరీరానుసారమైన కుమారుడు
ఆత్మానుసారమైన కుమారుని ఎలా హింసించాడో ఇప్పుడు కూడా
అలాగే జరుగుతుంది.
30 అయితే లేఖనం ఏమి చెప్తుంది? "దాసిని ఆమె కుమారున్ని
పంపివేయి, దాసి కుమారుడు ఎప్పటికీ స్వతంత్రురాలైన స్త్రీ
కుమారునితో వారసత్వం పంచుకోలేడు"† అని చెప్తుంది.
31 కాబట్టి సహోదరీ సహోదరులారా, మనం దాసురాలైన స్త్రీ పిల్లలం
కాదు, గాని స్వతంత్రురాలైన స్త్రీ పిల్లలము.

# 5

## క్రీస్తులో స్వాతంత్ర్యం

1 క్రీస్తు మనకు విడుదల ఇచ్చి మనల్ని స్వతంత్రులుగా చేశారు.
కాబట్టి మీరు స్థిరంగా నిలబడండి; బానిసత్వపు కాడి ద్వారా మీరు
మళ్ళీ మీమీద భారాన్ని మోపుకోకండి.
2 నా మాటలను గుర్తు పెట్టుకోండి! పౌలు అనే నేను చెప్పేది
ఏంటంటే, మీరు సున్నతి పొందినవారైతే, క్రీస్తు ద్వారా మీకు ఏమాత్రం
ప్రయోజనం ఉండదు.
3 సున్నతి పొందినవారు ధర్మశాస్త్రమంతటికి లోబడి ఉండాలని
అందరితో మళ్ళీ నేను చెప్తున్నాను.
4 ధర్మశాస్త్రం చేత నీతిమంతులుగా తీర్చబడాలని ప్రయత్నిస్తున్న
మీరు క్రీస్తు నుండి దూరం చేయబడ్డారు. మీరు కృపకు
దూరమయ్యారు.

* **4:27** యెషయా 54:1 † **4:30** ఆది 21:10

5 నీతిమంతులుగా తీర్చబడాలనే మన నిరీక్షణ నెరవేరాలని మనం విశ్వాసం కలిగి ఆత్మ ద్వారా ఆసక్తితో ఎదురుచూస్తున్నాము.
6 యేసు క్రీస్తులో ఉన్నవారు సున్నతి పొందినా పొందకపోయినా దానివల్ల ప్రయోజనమేమి ఉండదు. కేవలం ప్రేమ ద్వారా వ్యక్తపరచబడే విశ్వాసం మాత్రమే ప్రయోజనకరం అవుతుంది.
7 మీరు బాగా పరుగెడుతున్నారు. మీరు సత్యానికి లోబడకుండా మిమ్మల్ని ఆపిన వారెవరు?
8 అలాంటి బోధ మిమ్మల్ని పిలిచే వాని నుండి రాలేదు.
9 "పులిసిన పిండి కొంచెమైనా మొత్తం పిండిని పులియజేస్తుంది."
10 మీరు మరోలా ఆలోచించరని ప్రభువులో నేను నమ్మకం కలిగి ఉన్నాను. మిమ్మల్ని గందరగోళానికి గురిచేసేవారు ఎవరైనా సరే వారు తగిన శిక్షను భరించాలి.
11 సహోదరీ సహోదరులారా, ఒకవేళ నేను ఇంకా సున్నతి గురించి ప్రకటిస్తూ ఉన్నట్లయితే, మరి నేనెందుకు ఇంకా హింసించబడుతున్నాను? అలా అయితే సిలువను గురించిన నేరం రద్దు చేయబడింది కదా.
12 మిమ్మల్ని గందరగోళానికి గురిచేసేవారు తమను తాము నరికివేసుకోవడం మంచిది!

## ఆత్మ ద్వారా జీవితం

13 నా సహోదరీ సహోదరులారా, మీరు స్వతంత్రులుగా ఉండడానికి పిలువబడ్డారు. అయితే మీ స్వాతంత్ర్యాన్ని శరీరాశలను నెరవేర్చడానికి ఉపయోగించకుండా, ప్రేమ కలిగి వినయంతో ఒకరికొకరు సేవ చేసుకోండి.
14 "మీకులా మీ పొరుగువారిని ప్రేమించాలి"* అనే ఒక్క ఆజ్ఞను పాటించడం వలన ధర్మశాస్త్రమంతా నెరవేరుతుంది.

---

* **5:14** లేవీ 19:18

15 ఒకవేళ మీరు ఒకరినొకరు కరచుకుని మ్రింగివేస్తున్నట్లయితే,
జాగ్రత్తపడండి లేదా ఒకరి వలన ఒకరు నాశనం అవుతారు
జాగ్రత్తపడండి.

16 కాబట్టి, నేను చెప్పేదేంటంటే, ఆత్మను అనుసరించి
నడుచుకోండి, అప్పుడు మీరు శరీరవాంఛలను తృప్తి పరచరు.
17 శరీరవాంఛలు ఆత్మకు విరుద్ధమైనవి, ఆత్మ సంబంధమైనవి
శరీరానికి విరుద్ధమైనవి. అవి ఒక దానికి ఒకటి వ్యతిరేకం కాబట్టి
మీరు చేయాలనుకున్నవాటిని మీరు చేయరు.
18 మీరు ఆత్మ చేత నడిపించబడుతున్నవారైతే, ధర్మశాస్త్రం క్రింద
ఉన్నవారు కారు.

19 శరీర సంబంధమైన క్రియలు స్పష్టంగా ఉన్నాయి. అవేమంటే:
లైంగిక దుర్నీతి, అపవిత్రత, వేశ్యాలోలత్వము;
20 విగ్రహారాధన, క్షుద్రవిద్య; ద్వేషం, విరోధం, అసూయ,
అధికమైన ఆగ్రహం స్వార్థపూరిత ఆశలు, భేదాభిప్రాయాలు,
విభేదాలు,
21 ఓర్వలేనితనం, మద్యం మత్తు, పోకిరి ఆటలు మొదలైనవి.
నేను గతంలో మిమ్మల్ని హెచ్చరించినట్లుగా ఇలాంటి జీవితాన్ని
జీవించేవారు దేవుని రాజ్యానికి వారసులు కాలేరని మళ్ళీ
హెచ్చరిస్తున్నాను.

22 అయితే ఆత్మ వలన కలిగే ఫలం ఏమనగా ప్రేమ, సంతోషం,
సమాధానం, ఓర్పు, దయ, మంచితనం, విశ్వాసం,
23 మృదుత్వం, మనస్సును అదుపు చేసుకోవడం. ఇలాంటి వాటికి
వ్యతిరేకంగా ఏ నియమం లేదు.
24 యేసు క్రీస్తుకు సంబంధించినవారు శరీరాన్ని దాని వాంఛలతో
దురాశలతో సిలువ వేశారు.
25 మనం ఆత్మ వలన జీవిస్తున్నాం కాబట్టి మనం ఆత్మతో పాటు
నడుద్దాము.

26 ఒకరినొకరు రెచ్చగొట్టుకుంటూ, ఒకరిపై ఒకరు అసూయపడుతూ, మనం అహంకారులుగా ఉండవద్దు.

# 6

## అందరికి మంచి చేయడం

1 సహోదరీ సహోదరులారా, ఎవరైనా పాపంలో చిక్కుకొని ఉంటే, ఆత్మ వల్ల జీవిస్తున్న మీరు వారిని మృదువుగా సరియైన మార్గంలోనికి మరలా తీసుకురండి. అంతేకాక మీరు కూడా శోధనలో పడిపోవచ్చు కాబట్టి మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి.

2 ఒకరి భారాలను ఒకరు మోయండి, ఈ విధంగా మీరు క్రీస్తు ధర్మాన్ని నెరవేరుస్తారు.

3 ఎవరైనా తమలో ఏ గొప్పతనం లేకపోయినా తాము గొప్పవారమని భావిస్తే వారు తమను తామే మోసపరచుకుంటారు.

4 ప్రతి ఒక్కరూ తమ తమ పనులను పరీక్షించుకోవాలి. అప్పుడు ఇతరులతో తమను పోల్చుకోకుండా కేవలం తమను బట్టి తామే గర్వపడగలరు.

5 ఎందుకంటే ప్రతి ఒక్కరు ఎవరి భారాలను వారే మోయాలి.

6 వాక్యోపదేశం పొందినవారు తమకు ఉపదేశించినవానితో మంచి వాటన్నిటిని పంచుకోవాలి.

7 మోసపోవద్దు, దేవుడు వెక్కిరింపబడరు. ఒకరు దేన్ని విత్తుతారో దాని పంటనే కోస్తారు.

8 తమ శరీరాలను సంతోషపరచడానికి విత్తేవారు తమ శరీరం నుండి నాశనమనే పంట కోస్తారు. తమ ఆత్మను సంతోషపరచడానికి విత్తేవారు తమ ఆత్మ నుండి నిత్యజీవమనే పంటను కోస్తారు.

9 మంచి చేయడంలో మనం అలసి పోవద్దు ఎందుకంటే మానక చేస్తే తగిన కాలంలో మనం పంటను కోస్తాము.

10 కాబట్టి, మనకున్న అవకాశాన్ని బట్టి ప్రజలందరికి మరి ముఖ్యంగా విశ్వాసుల కుటుంబానికి చెందిన వారికి మంచి చేద్దాము.

### సున్నతి కాదు కాని నూతన సృష్టి

11 నా స్వహస్తాలతో పెద్ద అక్షరాలను ఉపయోగించి మీకు
వ్రాస్తున్నాను!

12 శరీర సంబంధమైన వాటితో ప్రజలను ఆకట్టుకోవాలని
అనుకునేవారు సున్నతి పొందాలని మిమ్మల్ని బలవంతం చేయడానికి
ప్రయత్నిస్తారు. క్రీస్తు సిలువ కోసం హింసించబడకుండ ఉండడానికే
వారు ఇలా చేస్తారు.
13 సున్నతి పొందినవారు ధర్మశాస్త్రాన్ని నెరవేర్చడం లేదు కాని
శరీరానుసారమైన మీ సున్నతిని గురించి వారు గొప్పలు చెప్పుకోడానికి
మీరు సున్నతి పొందాలని వారు కోరుచున్నారు.
14 మన ప్రభువైన యేసు క్రీస్తు సిలువలో తప్ప మరి దేనిలో నేను
అతిశయపడను. ఆ సిలువ ద్వారానే నాకు లోకం, లోకానికి నేను
సిలువ వేయబడి ఉన్నాము.
15 సున్నతి పొందినా పొందకపోయినా అది లెక్కకు రాదు. నూతన
సృష్టి మాత్రమే లెక్కించబడుతుంది.
16 ఈ నియమాన్ని అనుసరించే వారందరికి అనగా దేవుని
ఇశ్రాయేలుకు సమాధానం కనికరం కలుగుతాయి.

17 నేను నా శరీరంపై యేసు గుర్తులను కలిగి ఉన్నాను, కాబట్టి
ఇకపై ఎవరూ నన్ను శ్రమ పెట్టవద్దు.

18 సహోదరీ సహోదరులారా, మన ప్రభువైన యేసు క్రీస్తు కృప మీ
ఆత్మతో ఉండును గాక ఆమేన్.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.

You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."

Notice of copyright must appear on the title or copyright page of the work as follows:

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.

"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.

You must also make your derivative work available under the same license (CC BY-SA).

If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6